**జరిగిన కథ :** గంగలో మునిగిపోతున్న ఒక స్త్రీని రక్షించబోయి.. ఫణిదత్తుడు పాతాళానికి వెళ్లిపోయాడు. అక్కడ వరుణకన్యకల కోరిక మేరకు సింహంతో యుద్ధం చేసి, కొన్ని దివ్యవస్తువులు సంపాదించుకున్నాడు. పిత్రుదత్తకు గర్భం చేసిన మణి మంతుడు.. కాళిదాసు ప్రభావం వల్ల భోజరాజు వద్దకు వచ్చాడు. ఆయన శాసనం ప్రకారం పిత్రుదత్తను భార్యగా చేపట్టాడు.







# ఫణిదత్తుని రాక

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

కాశీనగరం ప్రశాంతంగా ఉంది. గంగ ఒడ్డున కూర్చుని సుబాహుడు తన మనసులో ఫణిదత్తుడి గురించే తలపోస్తున్నాడు.

'మిత్రమా! నిన్ను చేజార్చుకున్న తరువాత నాకీ జీవితం ఎందుకు!' అని కన్నీరు కారుస్తున్నాడు.

సరిగ్గా ఆ సమయంలోనే నదినుంచి ఒక మనిషి పైకి లేచి వస్తున్నాడు. సుబాహుడు ముందుగా పట్టించుకోలేదు కానీ, ఆ మనిషి దగ్గరికి వస్తున్నకొద్దీ అతని ఆశ్చర్యానికి, ఆనందానికి మేర లేకుండా పోయింది. పరుగుపరుగున వెళ్లి కౌగిలించుకున్నాడు.

''మిత్రమా! వచ్చావా? బతికే ఉన్నావా?'' అంటూ ఒళ్లంతా తడిమి చూశాడు.

ఫణిదత్తుడు గట్టుకు వచ్చి, సేదదీరిన తరువాత తన కథనంతా వివరంగా చెప్పాడు. తాను పాతాళలోకానికి వెళ్లడం, అక్కడ వరుణకన్యకల కోరిక మేరకు సింహాన్ని చంపడం వరకు గల కథనంతా చెప్పాడు.

* * *

సింహాన్ని చంపిన తరువాత ఆ లోకానికి రెండో దిక్కున కాపలాగా ఉన్న గుర్రం దగ్గరికి వెళ్లాడు ఫణిదత్తుడు. సింహం దగ్గర శంఖం, చురకత్తి ఉన్నట్లే.. ఈ గుర్రం దగ్గర ఒక తాళం చెవి, నాగమణి ఉంటాయి. అవి రెండూ ముందుగా చేజిక్కించుకుంటే తప్ప గుర్రాన్ని చంపడం సాధ్యం కాదు. ఫణిదత్తుడు అలాగే చేసి, గుర్రాన్ని చంపాడు.

దివ్యవస్తువులతో వరుణకన్యకలు ఉన్న దిక్కుకు బయల్దేరాడు. కొంతదూరం వెళ్లాక.. దారి మధ్యలో నేలలో పాతిన ఇనుపతలుపు ఒకటి కనిపించింది.

'ఇదే వరుణలోకానికి మార్గం అయి ఉండాలి' అనుకుంటూ, తన చెంతనున్న తాళం చెవితో తలుపు తెరిచేందుకు ప్రయత్నించాడు. వెంటనే తలుపు పైకి ఎగిరిపోయింది. లోపలికి సోపాన మార్గం దర్శనమిచ్చింది.

సాహసంతో ఆ మార్గంలో ప్రవేశించి పదిమెట్లు దిగగానే రెండుదారులు కనిపించాయి. కుడివైపు మార్గాన్ని ఎంచుకుని, కొంచెం దూరం వెళ్లగానే చీకటి పోయి వెలుగు వచ్చింది. ఆ వెలుగులో అతనికొక గుడి, ఆ పక్కనే ఒక సరోవరం కన్నులపండువ కావించాయి. బాగా అలసిపోయి ఉన్న కారణంగా ఆ చెరువులో హాయిగా స్నానం చేయాలనిపించింది.

..''కట్టుబట్టలతోనే చెరువులో మునిగాను. లేచి చూస్తే ఇక్కడ తేలాను. ఇదంతా కలకాబోలు అనుకున్నాను కానీ, చూడు.. నేను సంపాదించుకున్న వస్తువులన్నీ నా దగ్గరే ఉన్నాయి'' అని వాటిని సుబాహుడికి చూపాడు ఫణిదత్తుడు.

''నిజమే! లోకంలో అప్పుడప్పుడూ ఇలాంటి వింతలు జరుగుతుంటాయి'' అన్నాడు సుబాహుడు.

''ఇంతకూ మన మిత్రులందరూ ఎలా ఉన్నారు?! నేను పాతాళానికి వెళ్లి ఎంతకాలమైందో చెప్పగలవా?!'' అడిగాడు ఫణిదత్తుడు.

''సుమారుగా ఏడాది కాలం గడిచి ఉంటుంది. నువ్వు బతికి ఉంటావనే ఆశ వదిలేసుకుని మేమందరం పాటలీపుత్రం వెళ్లిపోయాం. నీ మరణవార్త విని, మీ అమ్మ గుండెలు బాదుకుని ఏడ్చింది. మేం వెళ్లిన కొద్ది రోజులకు మహారాజుగారు మరణించారు. రుక్మవర్మ రాజయ్యాడు. మేమింక ఆ నగరంలో ఉండలేక పోయాం. మన సుప్రహస్తుడు, వజ్రకాయుడు ఉజ్జయినిలో ఉంటున్నారు. నేను మాత్రం నీ జ్ఞాపకాలను మరిచిపోలేక, ఎప్పటికైనా తిరిగివస్తావని ఏదో ఒక గుడ్డినమ్మకంతో ఇక్కడికి వచ్చాను. నా అదృష్టం కొద్దీ నువ్వు కంటపడ్డావు'' అని చెప్పాడు సుబాహుడు.

''అబ్బా! అంతకాలమైందా? సరే.. పద. మనం వేగంగా ఇంటికి పోదాం. వెంటనే అమ్మను చూడాలి. పాపం నాకోసం ఎంత బెంగపెట్టుకుందో'' అన్నాడు ఫణిదత్తుడు బయల్దేరదీస్తూ.

వాళ్లిద్దరూ ఆనాడే ప్రయాణం కట్టారు. పాటలీపుత్రం అక్కడికి ఇరవైరోజుల ప్రయాణ దూరం. మార్గమధ్యంలో వారికి తమ ఊరి వర్తకుడొకడు కనిపించాడు.

''ఊళ్లో విశేషాలేమిటి? రుక్మవర్మ కుదురుగా ఉంటున్నాడా?'' అని అడిగాడు సుబాహుడు.

''బాగానే ఉన్నాడు. చచ్చి బతికిన తరువాత బుద్ధి